

గోపురానికి రంగులు వేస్తూ..

రంగవల్లులు.. బ్రహ్మోత్సవ కాంతులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 4 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సంబంధిత ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధాన, అనుబంధ ఆలయాలకు రంగులు వేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా రంగవల్లులు వేస్తున్నారు. ప్రధాన కూడళ్ల తదితర ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలంకరణ, ఆర్చిలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు అవసరమైన క్యూలైన్ల నిర్మాణం చేపడుతున్నారు. పనులను పాలకమండలి ఛైర్మన్ వి.మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ పర్యవేక్షిస్తున్నారు. **- న్యూస్‌టుడే, కాణిపాకం**



ఆలయంలో ముగ్గులు వేస్తున్న కార్మికులు

శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2, నారాయణగిరి షెడ్లలో వేచి ఉన్నారు. వీరికి 10 గంటల్లో, రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది. శ్రీవారిని శనివారం 85,246 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ కానుకలు రూ.4.30 కోట్లు లభించాయి.

● చిత్తూరు రూరల్ మండలానికి చెందిన రైతు తనకున్న 1.50 ఎకరాల భూమిని సర్వేచేసి హద్దులు చూపాలని నాలుగు నెలల కిందట అర్జీ ఇచ్చారు. చలానా కూడా చెల్లించారు. 15 రోజుల తర్వాత స్పందించిన సర్వే సిబ్బంది మరుసటి వారం క్షేత్రస్థాయికి వస్తామని సమాధానమిచ్చినా సర్వే మాత్రం చేయలేదు. సంబంధిత రైతుతో సర్వే పూర్తయినట్లు సంతకాలు మాత్రం పెట్టించుకున్నారు. ఈనెలలో మరోసారి ఆ అన్నదాత అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

వీరి నిర్లక్ష్యాన్ని కొలవలేం

■ ప్రజలను పదేపదే తిప్పించుకుంటున్న సర్వేయర్లు
■ ఏశాఖలో లేనివిధంగా 12.18% అర్జీలు రీఓపెన్

ఈనాడు- చిత్తూరు: ప్రతి సోమవారం కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాలకు ప్రజల నుంచి వచ్చే అర్జీల్లో సర్వేశాఖకు సంబంధించే 20 శాతం ఉంటున్నాయి. తమ భూమిని సర్వేచేసి హద్దులు చూపించాలని పదేపదే కోరుతున్నా సిబ్బంది మాత్రం నిర్లిప్తత వీడటంలేదు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. పొరపాటున క్షేత్రస్థాయికి వస్తే కాసులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఖర్చులకు డబ్బులు, విందు సమకూర్చాలని చెబుతున్నారు. అడిగిన కాడికి సమర్పించుకున్నా నివేదికలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. దాంతో అర్జీదారులు మరోసారి వినతులు సమర్పిస్తున్నారు. ఏశాఖలో లేనివిధంగా ఇక్కడే ఎక్కువగా దరఖాస్తులు రీ- ఓపెన్ అవ్వడానికి సర్వేయర్ల వైఖరే ప్రధాన కారణం. ఉన్నతాధికారులు ఒకరిద్దరిపై చర్యలు తీసుకుంటే తప్ప ప్రజలకు వీరి వేధింపులు తగ్గేలా లేవు.

శాంతిపురంలో ఏకంగా 25 శాతం

జిల్లా వ్యాప్తంగా 12.18 శాతం అర్జీలు రీ ఓపెన్ అయ్యాయి. అత్యధికంగా శాంతిపురం మండలంలో 25 శాతం అర్జీలు తిరిగి తెరిచారు. నింద్రలో 632 దరఖాస్తులు రాగా ఇందులో 17 శాతం రీఓపెన్ చేశారు. చిత్తూరు రూరల్‌లో ఇది 18 శాతంగా ఉంది. రొంపిచెర్ల మండలంలో 13 శాతం రీఓపెన్ అయ్యాయి. పెనుమూరు, నగరి, చిత్తూరు అర్బన్ మండలాల్లో మాత్రం అర్జీలు తెరవలేదు. సర్వే సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు విన్నవిస్తున్నారు.

ఎవరైనా లంచం ఇవ్వాల్సిందే

● కొందరు గ్రామ, మండల సర్వేయర్లు భూమి విలువను బట్టి లంచాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంత పలుకుబడి ఉన్నా, ఉన్నతాధికారులు చెప్పినా తమ రూటు తమదేనన్నట్లు వ్యవహరిస్తున్నారు. ● గత ప్రభుత్వంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి స్థలానికి సర్వేచేసి సబ్ డివిజన్‌కు నివేదిక ఇవ్వడానికి శాంతిపురం మండలంలో ఓ సర్వేయర్ డబ్బులు తీసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ బాగోతం వెలుగు చూసింది. సీఎం భూమికే ఈ విధంగా చేసినప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ● ఉన్నతాధికారులు పదేపదే హెచ్చరిస్తున్నా వీరి వైఖరిలో మాత్రం మార్పు రావడంలేదు. నిర్దిష్ట గడువు సమీపించిన తరుణంలో అర్జీదారులను సంప్రదించి సర్వే పూర్తయినట్లు సంతకాలు తీసుకుంటున్నారు. ● సర్వేయర్లతో ఎందుకు సమస్యలు తెచ్చుకోవాలని ప్రజలు కూడా వారు చెప్పినట్టే చేస్తున్నారు. తర్వాత ఉలుకూపలుకూ లేకపోవడంతో అనివార్యంగా అర్జీలు సమర్పిస్తున్నారు.

● తిరుపతి జిల్లా పుత్తూరు మండలం కేబీఆర్‌పురానికి చెందిన రైతు కేశవులు జులై మొదటి వారంలో గుజ్జు పరిశ్రమకు మామిడి కాయలు సరఫరా చేశారు. టన్నుకు రూ.5 వేలు చెల్లించేలా యజమాని బిల్లు ఇచ్చారు. కానీ ఇప్పటికీ నగదు జమచేయలేదు.

● చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన చిన్నయ్య ఆరెకరాల్లో పండిన 45 టన్నుల తోతాపురి కాయలు నారాయణవనంలోని పరిశ్రమకు తరలించారు. ఇప్పటికే రెండుసార్లు యజమానిని నగదు కోసం కలిశారు. సెప్టెంబరులో కాదు అక్టోబరులో జమచేస్తామని చెప్పి రైతును పంపించేశారు.

కాళ్లరిగేలా పరుగులు..
కళ్లచూడలేని బిల్లులు

❖ తోతాపురి రైతులను పట్టించుకోని గుజ్జుపరిశ్రమలు
❖ రావాల్సింది రూ.300 కోట్ల పైమాటే



మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద నిలిచి ఉన్న ట్రాక్టర్లు

పుత్తూరు, న్యూస్‌టుడే: మామిడి రైతుల కష్టాలు తీరడం లేదు. ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇబ్బందులు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా తోతాపురి కాయలను గుజ్జు పరిశ్రమలకు ఇచ్చిన రైతులు బిల్లుల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

ప్రోత్సాహకాలు తగ్గించినా..

కూటమి ప్రభుత్వం తోతాపురి రైతులను ఆదుకునేందుకు టన్నుకు గుజ్జు పరిశ్రమలు రూ.8 వేలు చెల్లించాలని ఆదేశించింది. ప్రభుత్వ ప్రోత్సాహకం కింద రూ.4 వేలు ఇస్తామని ప్రకటించింది. కానీ గుజ్జు పరిశ్రమల యజమానులు కొందరు రూ.5వేలు, మరికొందరు రూ.6 వేలు చెల్లిస్తామని ప్రకటించారు. అయినా రైతులు పంట విక్రయించాల్సిన పరిస్థితి ఎదురైంది. కానీ ఇప్పుడు బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు కన్నీరు కారుస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గతేడాది చిత్తూరులోని ఓ కర్మాగారం యజమాని రూ.2 కోట్ల బకాయిలు సంక్రాంతి వరకు చెల్లించకుండా తిప్పించుకున్నారు.

రెండు నెలలు అవుతున్నా..

మామిడి రైతులు గుజ్జు పరిశ్రమలకు పంటను తరలించి రెండు నెలలు అవుతోంది. ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 10 శాతం మంది రైతులకు కూడా బిల్లులు రాలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం చెల్లించాల్సిన నగదు కోసం లెక్కలు సిద్ధం చేస్తోంది. అవి సుమారు రూ.200 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉంది. దీంతో పాటు పరిశ్రమలు రూ.300 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. తమ ఖాతాల్లోకి త్వరితగతిన నగదు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నగదు చెల్లించేలా చూస్తాం..

గుజ్జు పరిశ్రమల రైతులకు నగదు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నగదుకు సంబంధించి అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. అది పూర్తయిన వెంటనే గుజ్జు పరిశ్రమల యజమానులతో మాట్లాడి రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తాం. **- సతీష్, డీడీ, ఉద్యాన శాఖ, చిత్తూరు జిల్లా**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పరిస్థితి	సాగు విస్తీర్ణం	తోతాపురి	గుజ్జు పరిశ్రమలు కొనుగోలు చేసింది:	రావాల్సిన బకాయిలు
	1.12 లక్షల హెక్టార్లు	55 వేల హెక్టార్లు	5 లక్షల టన్నులు	సుమారు 300 కోట్లు

అరచేతిలో.. గ్రంథాలయం

● అందుబాటులో డిజిటల్ సేవలు

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, సాధారణ ప్రజల కోసం నూతన సేవలను అమల్లోకి తీసుకొచ్చారు. గ్రంథాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం పాఠకులకు అందుబాటులోకి వచ్చేలా చూస్తున్నారు. ఏ గ్రంథాలయంలో ఎలాంటి పుస్తకాలు ఉన్నయో తెలుసుకోవచ్చు. తమకు కావాల్సినవి చూసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లా సమాచారం

శాఖా గ్రంథాలయాలు: 71
అందుబాటులో పుస్తకాలు: 8 లక్షలకు పైగా
ఆన్‌లైన్‌లో అప్‌లోడ్: 60 వేలకు పైగా

ఏపీ గ్రంథాలయ యాప్

ఏపీ గ్రంథాలయ పేరుతో రూపొందించిన యాప్‌లో సభ్యత్వం ఉన్న పాఠకులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా డౌన్‌లోడ్ చేసుకోవడానికి ప్రత్యేక క్యూఆర్ కోడ్‌లను గ్రంథాలయాల వద్ద అతికిస్తున్నారు. గ్రంథపాలకులు నుంచి ఫైల్‌ను తీసుకుని చరవాణిలో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. గ్రంథాలయంలోకి ప్రవేశించే సమయంలో విజిటర్స్ లాగిన్‌పై క్లిక్ చేసి బార్ కోడ్‌ను స్కాన్ చేయాలి. గ్రంథాలయం నుంచి తిరిగి వెళ్లే సమయంలో మళ్లీ కోడ్‌ను స్కాన్ చేస్తే సక్సెస్ మెసేజ్ వస్తుంది.

65 వేల మందికి సభ్యత్వం..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 71 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 65 వేల మందికి సభ్యత్వం ఉంది. కొత్తగా రూపొందించిన యాప్ ద్వారా పుస్తకాలకు సంబంధించి సమాచారం ఒకే చోట అందుబాటులోకి వచ్చింది. రచయితలు, అంశాల వారీగా వివరాలు తెలుసుకునే సదుపాయం ఉంటుంది. తాము వెతుకుతున్న పుస్తకం అందుబాటులో ఉందా? లేదా? లేకపోతే జిల్లాలోని ఏ గ్రంథాలయంలో ఉందనే సమాచారం సైతం ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.



కుప్పంలో 3కె రన్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శారీరక ఆరోగ్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పిస్తూ కరాటే విద్యార్థులు ఆదివారం 3కె రన్ కుప్పంలో నిర్వహించారు. స్థానిక కడా కార్యాలయం నుంచి కార్యక్రమం చేపట్టారు. ఇటీవల చెన్నైలో నిర్వహించిన వరల్డ్ రికార్డ్ కరాటేలో కుప్పం విద్యార్థులు 23 మంది పాల్గొన్నట్లు ట్రెడిషనల్ అండ్ స్పోర్ట్స్ షోటోకాన్ కరాటే శిక్షకుడు ఏకాంబరం తెలిపారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా ఛైర్మన్ సురేష్‌బాబు, లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్, మాజీ ఎంపీపీ వెంకటేష్, సభ్యులు సెల్వం, ప్రసాద్, జయరాం, సంజీవ్, పీఈటీ స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుదైన జూ పార్కుకు..
బృహత్తర చూపు

● శాసనసభ కమిటీ సిఫార్సుల అమలుపైనే ఆశలు ● 20 ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల విస్తీర్ణపరంగా ఆసియాలో అతిపెద్దదిగా పేరుగాంచింది. శేషాచల పర్వతాలకు దిగువన 1254.71 హెక్టార్ల విస్తీర్ణంలోని ఓపెన్ ఫారెస్ట్‌లో జూపార్కు ఏర్పాటైంది. అయితే ప్రస్తుతం ఉన్న వన్యప్రాణుల నివాస స్థావరాలు, మౌలిక సదుపాయాలు కేవలం 289 హెక్టార్ల పరిధిలోనే ఉన్నాయి. ఇందులోనే 84 రకాలకు చెందిన 1,100 వన్యప్రాణులు, పక్షులు మనుగడ సాగిస్తున్నాయి. మిగిలిన 965.71 హెక్టార్ల భూమి ఖాళీగా ఉంది. దశలవారీగా సదుపాయాలు కల్పించి విస్తరించాలని గడచిన 20 ఏళ్లుగా ఆయా ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నా అడుగు ముందుకుపడటం లేదు.



రూ.6 కోట్లు తక్షణావసరం

తాజాగా ఏపీ వన్యప్రాణులు, పర్యావరణ కమిటీ సిద్ధం చేసిన ప్రతిపాదనల నేపథ్యంలోనైనా కొత్తకళ సంతరించుకునేనా అని అంతా ఎదురు చూస్తున్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఛైర్మన్‌గా వ్యవహరిస్తోన్న ఈ కమిటీ గతనెల 16వ తేదీన జూపార్కును సందర్శించి కీలక సూచనలు చేసింది. సింగపూర్ నిపుణుల సాయంతో అభివృద్ధికి చర్యలు చేపడతామని చెప్పింది. జూపార్కు అభివృద్ధికి తక్షణం రూ.6 కోట్లు అవసరమని గుర్తించి ఇందులో రూ.3 కోట్లు తితిదే నుంచి సమీకరించాలని, మిగిలిన రూ.3 కోట్లను కలెక్టర్ సీఎస్ఐఆర్ నిధుల ద్వారా సేకరించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే, ఎంపీల ద్వారా మరింత నిధులు సమకూర్చే ప్రయత్నం చేస్తామన్నారు.

గతంలోని ప్రణాళికలు ఇలా..

2009-14లో అప్పటి ప్రభుత్వం రూ.100 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రూపొందించింది. నైట్ సఫారీ, మోనోట్రైన్ ఏర్పాటు, వైట్ టైగర్ సఫారీ, డీర్ సఫారీ, తీగల వంతెనల నిర్మాణం చేపట్టాలని రోడ్డుమ్యాప్ సిద్ధం చేశారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. తర్వాత అనేక ప్రణాళికలు తెరపైకి తెచ్చినా అమలుకు నోచుకోలేదు.

తిరుమలకు వచ్చేవారిలో 4% రాక

వేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుపతి, తిరుమలకు 70వేల నుంచి లక్ష మంది వరకు వస్తుండగా వారిలో 4 శాతంమంది మాత్రమే జూకు వస్తున్నారని, దీన్ని 8 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. టాయ్ ట్రైన్ల ఏర్పాటు, ఫుడ్ కోర్టులు, అడ్వెంచర్, మిమిక్రీ వంటి కార్యక్రమాల ఏర్పాటుతోపాటు వివిధ భాషల్లో మాట్లాడగలిగిన గైడ్‌లను నియమించడం ద్వారా సందర్శకులను ఆకర్షించడం. కమిటీ సూచనలు, ప్రతిపాదనల్లో 50 శాతం అమల్లోకి వచ్చినా జూ దశ, దిశ మారుతుందన్న అభిప్రాయం జంతుప్రేమికుల నుంచి వ్యక్తమవుతోంది.

కీలక ప్రతిపాదనలు ఇవే

● అనుమతించిన మేర అడ్వెంచర్, ఎంటర్‌టైన్‌మెంట్ పార్కుల ఏర్పాటు. ● 13 కిలోమీటర్ల మేర కూలిపోయిన ప్రహరీ పునర్నిర్మాణం. ● అభివృద్ధికి అవసరమైన నిధులు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించేలా కృషి. ● కల్యాణి జలాశయం నుంచి నీటి కేటాయింపులు. ● జంతువులకు అవసరమైన రక్షిత నీటి ఫిల్టర్ల ఏర్పాటు. ● మంజూరైన పోస్టుల భర్తీకి చర్యలు. ● సుస్థిర ఆదాయ వనరుల ఏర్పాటు. ● పునుగు పిల్లుల విశిష్టత తెలియజేసేలా కేంద్రం ఏర్పాటు. ● ఎర్రచందనం ఎక్స్‌పీరియన్స్ సెంటర్, విక్రయ కేంద్రం ఏర్పాటు. ● ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు నడపడం.

నిర్వహణ కొత్తగా..
పనులు పక్కాగా

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వీబీజీ రామ్‌జీ కొత్తరూపు సంతరించుకుంటోంది. పథకం అమల్లో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వేతనదారులకు పాత జాబ్‌కార్డుల స్థానంలో కొత్తవి ఇవ్వాలని నిర్ణయించింది. మూడేళ్ల కాలపరిమితితో మహిళలు, వృద్ధులకు ప్రాధాన్యమిస్తూ వివిధ రంగుల్లో కార్డులను త్వరలోనే జారీ చేయనున్నారు. అప్పటివరకు పాతవే కొనసాగిస్తారు. శ్రామికులు పనిచేసిన 15 రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో వేతనం జమ చేస్తారు. ఆలస్యమైతే 16వ రోజు నుంచి పరిహారం చెల్లిస్తారు. కొత్తకార్డులు పొందినవారు మూడు నెలల్లోగా పనులకు వెళ్లకపోతే రద్దవుతాయి.

శాశ్వత ప్రాతిపదికన..: ఎల్‌నినో నేపథ్యంలో శాశ్వత పనులకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. చెరువుల్లో పూడికతీత, ఇంకుడు గుంతలు, అంగన్‌వాడీ, పంచాయతీ తదితర భవనాల నిర్మాణాలు చేపట్టనున్నారు. జీవనోపాధి వసతుల కింద పశువుల షెడ్లు, గిడ్డంగులు, వర్మీ కంపోస్టు యూనిట్లు, నిర్వహణ పనులు, మార్కెట్ ప్రాంగణాలు, సరకుల నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో వివరాలు..	
పథకం అమలవుతున్న మండలాలు	27
యాక్టివ్‌లో ఉన్న జాబ్ కార్డులు	2.24 లక్షలు
జాబ్ కార్డుల్లో నమోదైన కూలీలు	3.84 లక్షలు
హాజరవుతున్న వారు	35 వేల మంది

ఏఐ సాంకేతికతతో..

వర్షాభావం, వరదలు తదితర తీవ్ర వాతావరణ పరిస్థితులు తట్టుకునేందుకు నీటి నిల్వ వ్యవస్థల నిర్మాణం, మట్టి కోతలను నివారించేందుకు మొక్కలు నాటడం, నేల సంరక్షణ పనులు చేపడతారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇందులో భాగంగా మురుగు కాలువల నిర్మాణం, కమ్యూనిటీ భవనాల పనులు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నారు. అక్రమాలు జరగకుండా ఏఐని వినియోగిస్తున్నారు.

గ్రానైట్ క్వారీలో భారీ బ్లాస్టింగ్

● పొలాల్లో పడుతున్న రాళ్లు



పొలంలో ట్రాక్టరు పక్కన పడిన రాయి

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పురపాలక పరిధిలోని చెర్లోపలిలో తరచూ గ్రానైట్ క్వారీలో భారీగా మందుగుండు పెట్టి రాళ్లు పేల్చుతున్నారు. అవి సమీప పొలాల్లో పడుతుండటంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. తాజాగా చెర్లోపల్లికి చెందిన రైతు ఈశ్వర్‌యాదవ్ మామిడి తోటలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా క్వారీలో బ్లాస్టింగ్ చేశారు. ఓ రాయి ట్రాక్టర్‌కు పక్కన పడింది. దీంతో రైతు వాహనాన్ని వదిలేసి ప్రాణభయంతో పరుగులు పెట్టారు. బ్లాస్టింగ్ సమీపంలో కనీసం సైరన్ మోగించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అసలు అనుమతులు ఉన్నాయో, లేదో అధికారులు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్తు దొంగలకు షాక్

చిత్తూరు (మిట్టూరు): విద్యుత్తును అక్రమంగా వినియోగిస్తున్నారా.. మీటరు తిరగకుండా సొంత ప్రయోగాలు చేస్తున్నారా.. అక్రమ కనెక్షన్లు పెట్టి చోరీ చేస్తున్నారా.. అయితే మీ పని అయిపోయినట్లే. ఇలాంటి వారిపై విద్యుత్తుశాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. విద్యుత్తు చోరులపై కేసుల నమోదుతోపాటు జరిమానా విధిస్తున్నారు.

● ఎనిమిది నెలల్లో 6,726 కేసులు ● రూ.3.72 కోట్ల జరిమానా

భారీగా దాడులు

వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. సరఫరాలో తలెత్తే సమస్యలను పరిష్కరిస్తూ మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఈక్రమంలో కొందరు అక్రమార్కులు చౌర్యానికి పాల్పడుతూ సంస్థకు నష్టం కలిగిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు విద్యుత్తు విజిలెన్స్, ఆపరేషన్ విభాగం అధికారులు దృష్టి సారించారు. ఈ ఏడాది జనవరి నుంచి నిర్వహించిన దాడుల్లో 6,762 కేసులు నమోదు చేసి రూ.3.72 కోట్లు జరిమానా విధించారు.



వినియోగంలో తేడాలు గుర్తించి..

విద్యుత్తు సర్వీసులు ఎక్కువగా ఉండి, బిల్లింగ్ తక్కువగా ఉన్న ప్రాంతాలపై నిఘా పెడతారు. ఒకేసారి బిల్లింగ్ పడిపోవడం, యూనిట్ల వాడకంలో పూర్తిగా తేడాలుంటే ఆ ప్రాంతాల్లో పర్యటించి ఎందుకు తగ్గిందో ఆరా తీస్తారు. మీటరు బిగించే సమయంలో తీసుకున్న కిలోవాట్ల సామర్థ్యం కన్నా తక్కువ వాడకం ఉంటే ఆ ప్రాంతాల్లోనూ వివరాలు సేకరిస్తారు. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు సంబంధించి లైన్ లాస్ ఎక్కువగా ఉన్న చోట చౌర్యం జరుగుతున్నట్లు భావిస్తారు.

జిల్లాలో కేసుల వివరాలు, జరిమానా (రూ.లక్షల్లో)

అక్రమాలు	కేసులు	జరిమానా
మీటరు తిరగకుండా	249	5,94,252
డైరెక్ట్ ట్యాపింగ్	778	7,19,334
మాల్‌ప్రాక్టీస్	334	16,67,849
అదనపు లోడ్ (డెవలప్‌మెంట్‌ఛార్జీలు)	5050	2,26,32,792
బ్యాక్ బిల్లింగ్	315	1,15,87,808

రెండుసార్లు చేస్తే జైలుకే..

అనుమతులు లేకుండా విద్యుత్తు తీగలకు కొక్కీలు తగిలించి నేరుగా విద్యుత్తు వాడకం, గృహ అవసరాల నిమిత్తం కనెక్షన్ తీసుకుని వాణిజ్య కార్యకలాపాలకు వినియోగించడాన్ని చౌర్యంగా పరిగణిస్తారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కేసులు నమోదు చేశారు. మొదటి సారి విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే జరిమానా విధించి వదిలేస్తారు. అదే వ్యక్తి మరోసారి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తారు.

విస్తృతంగా అవగాహన..

విద్యుత్తు చౌర్యం నిర్మూలనపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా అక్రమంగా విద్యుత్తు చోరీచేస్తే జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో అక్రమాలు గుర్తిస్తే విద్యుత్తు శాఖ అధికారులు, కార్యాలయానికి సమాచారం తెలియజేయండి.
- సుబ్రహ్మణ్యం, ఈఈ, జిల్లా డీపీఈ విభాగం

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.



అందుబాటులో క్యూఆర్ కోడ్..

పీజీఆర్ఎస్ వ్యవస్థను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అర్జీల పరిష్కారంపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచింది. కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రజలు కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాలు, సూచనలు చెప్పొచ్చు. వాటిని సేకరించి పారదర్శక, జవాబుదారీ, పౌర కేంద్రీకృత సేవలు అందించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనికి తోడు దరఖాస్తుదారులు 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా తమ అర్జీల స్థితిని తెలుసుకునే అవకాశం కల్పించింది. కోడ్ ద్వారా చెప్పే వివరాలు పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదవుతాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.

నీట్ పీజీ ప్రశాంతం



ఎస్వీసెట్ కళాశాల వద్ద పోలీసులకు సూచనలిస్తున్న ఏఎస్పీ ఎస్ షాను

చిత్తూరు విద్య, పూతలపట్టు, న్యూస్‌టుడే: నీట్ పీజీ ఆదివారం పోలీస్ పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 594 మంది రాయాల్సి ఉండగా 17 మంది గైర్హాజరయ్యారు. 577 మంది పరీక్ష రాశారు. ఆర్వీఎస్ నగర్‌లోని ఎస్వీసెట్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ ఎస్ షాను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలను వినియోగించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించారు.

అంకాళమ్మ.. ఆదుకోవమ్మ



గంగాధరనెల్లూరులోని అంకాళమ్మ తోపులో ఆదివారం రాత్రి అంకాల పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంబల వంశస్థులు మట్టితో అమ్మవారి రూపాన్ని తీర్చిదిద్ది ప్రత్యేకంగా అలంకరించారు. కలవకుంటలో కుల దైవానికి, జీడీనెల్లూరులో అల్లియల్లమ్మకు పూజల అనంతరం అంకాళమ్మ ఉత్సవాలు నిర్వహించారు. రాత్రి వేళ కుంకుమార్చన, పూర్ణాహుతి, మంగళహారతి చేపట్టారు. - **న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు**

వరుణ యాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కె.ఎస్.ఎస్. అవధాని, రుత్వికులు

తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో తితిదే చేపట్టిన కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్య శాంతి హోమాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రాయశ్చిత్త హోమం, అంకురార్పణ చేపట్టారు. సెప్టెంబరు 3వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈ యాగ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కె.ఎస్.ఎస్.అవధాని ఆధ్వర్యంలో ఈ యాగాలు జరుగుతున్నాయి.

8న తితిదే పాలకమండలి సమావేశం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే పాలకమండలి సమావేశం సెప్టెంబర్ 8వ తేదీన తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి తితిదే ఉన్నతాధికార యంత్రాంగం అజెండా తయారీలో ఇప్పటికే నిమగ్నమయ్యారు. ముఖ్యంగా సెప్టెంబరు, అక్టోబర్ మాసాల్లో జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలపై చర్చించనున్నారు. తాత్కాలిక, టైంస్కేల్, సొసైటీ, కార్పొరేషన్, అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, సిబ్బంది, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను అజెండాలో పొందుపరిచే అవకాశం ఉంది.

శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. **తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, తితిదే మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం దంపతులు దర్శించుకున్నారు. ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

భవన నిర్మాణాలపై ఇంపాక్ట్

❖ పనులకు భారీగా రుసుములు / ❖ గత ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు

✶ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నగర, పురపాలక సంఘాల పరిధిలో 2,67,278 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.191.04 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలవుతుంది. ✶ పుత్తూరు పట్టణంలోని స్వర్ణ హౌసింగ్ కాలనీలో జీప్లస్ వన్ ఇంటి నిర్మాణానికి రుసుములన్నీ లెక్కిస్తే సుమారు రూ.52,630 చెల్లించాల్సి వచ్చింది. వాణిజ్య సముదాయం అయితే చెల్లించాల్సిన రుసుం రెండింతలుగా మారింది.

పుత్తూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఇంపాక్ట్ రుసుము పేరుతో పన్ను విధించడంతో నిర్మాణదారులకు భారంగా మారింది. నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణాలకు ప్లాన్ అనుమతి పొందే సమయంలో నిర్మాణ ప్రాంతంలో చదరపు అడుగు ప్రకారం రుసుము వసూలు చేస్తున్నారు. దీంతో నగర పాలికలు, పురపాలికల పరిధిలో నిర్మాణాల అనుమతులకే రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

వివిధ రకాల పేర్లతో...

ఇంపాక్ట్ పన్ను, వీఎల్‌టీకి సంబంధించి మార్కెట్ విలువలో 0.05 శాతం కింద లెక్కిస్తే రూ.500 వచ్చిందనుకున్నాం. దీనికి ఏడుసార్లు లెక్కిస్తే రూ.3,500 చెల్లించాల్సి ఉంది. లేబర్ సెస్సు, మొత్తం జాగా విలువలో ఒక శాతం, ట్రీగార్డు రూ.1,500, ఇంకుడు గుంత రూ.3-5వేలు, అభివృద్ధి ఛార్జీ, భవన లైసెన్సు రుసుం, కాంపౌండ్ వాల్, యూజర్ ఛార్జీలు ఇలా పలు రకాల రుసుములు విధించి వసూలు చేస్తున్నారు.

అనుమతి సమయంలో బాదుడు..

స్థలంపై రిజిస్ట్రేషన్‌శాఖ నిర్ణయించిన మార్కెట్ విలువపై కార్పొరేషన్‌లో 2 శాతం, పురపాలక పరిధిలో 1 శాతం, పంచాయతీల్లో 0.5 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఇంపాక్ట్ రుసుము ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాల్లోనే అమలు చేస్తున్నారు. మాస్టర్ ప్రణాళికలో భాగంగా 60 అడుగుల నుంచి 150 అడుగుల వరకు ప్రతిపాదిత రోడ్డు, రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులు, బైపాస్ రోడ్డు, రింగ్ రోడ్డు పక్కన నిర్మించే నిర్మాణాలకు వర్తింపజేశారు. ఒక్కో నిర్మాణంపై ప్లాన్ సమయంలోనే రూ.లక్ష నుంచి రూ3.లక్షల వరకు అదనంగా భారం పడుతోంది.

ఇవీ ఛార్జీలు..

కన్వర్షన్ ఛార్జీలు చ.మీ.కు రూ.15-20, లేఔట్ ఆమోదానికి హెక్టారుకు రూ.20 వేలు, సైట్ ఆమోదం చ.మీ.కు రూ.15, ఓపెన్ సైట్ ఛార్జీలు మొత్తం విలువలో 14 శాతం, బిల్డింగ్ పర్మిట్ రుసుము రూ.15-80, ఇంధన స్టేషన్లు, వే‌బ్రిడ్జిలకు చ.మీ.కు రూ.100, ఎగ్జిబిషన్, సర్కస్ తదితరాలకు చ.మీ.కు రూ.15 వరకు విధిస్తున్నారు.

నేడు 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్'

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా ఏఆర్ (పాత డీపీవో) కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ నిర్వహించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. సమస్యలను ఎదుర్కొంటున్న ప్రజలు ఫిర్యాదులు అందించి న్యాయం పొందొచ్చని వివరించారు. ఫిర్యాదులను ఎస్పీ, ఏఎస్పీలు స్వీకరించి వారం రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఎస్ఈ'

సంప్రదించాల్సిన నంబరు: 79931 47979

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: నాణ్యమైన విద్యుత్తు సరఫరా, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఎస్ఈ అమరబాబు తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. విద్యుత్తు సమస్యలు, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

త్వరలో సేవా సంకల్ప ఉత్సవం



శ్రీవారి ఆలయం ఎదుట భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్, చిత్రంలో నాయకులు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, రమేష్‌నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మోదీ.. దేశం కోసం చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప ఉత్సవం' నిర్వహిస్తున్నట్లు ఏపీ భాజపా అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. ఆదివారం భాజపా నాయకులతో కలిసి శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలోనే దేశవ్యాప్తంగా సేవా సంకల్ప ఉత్సవం నిర్వహించి దేశం కోసం మోదీ చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో భాజపా నాయకులు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

సాయం అందుకోండి.. పట్టభద్రులుగా మారండి

❖ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఉపకార వేతనాలు

❖ దరఖాస్తులకు నేడు ఆఖరు

పుత్తూరు, న్యూస్‌టుడే: బాలికల చదువు.. సమాజానికి వెలుగు. అయినప్పటికీ వివిధ కారణాలతో కొందరు బాలికలు పది, ఇంటర్ తర్వాత ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులు కొనసాగించలేని నిరుపేద బాలికలకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించేందుకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. 2026-27 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాలు అందించేందుకు ఆన్‌లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

5 నుంచి 8 వేల మంది..

జిల్లాలో ఏటా 35 వేల మంది ఇంటర్మీడియట్ పూర్తి చేస్తున్నారు. ఉత్తీర్ణులయ్యే వారిలో కేవలం 5 నుంచి 8 వేల మంది విద్యార్థులు డిగ్రీ చదువుతున్నారు. మరికొందరు ఇంజినీరింగ్, మెడిసిన్, వివిధ రకాల కోర్సుల్లో చేరుతున్నారు. బాలికలు ఎక్కువ మంది సమీప డిగ్రీ కళాశాలలకే పరిమితం అవుతున్నారు. తర్వాత చదువు ఆపేస్తున్నారు. ఇలాంటి వారి ఉన్నత చదువులకు ఉపకార వేతనం ఉపయోగపడనుంది.

వీరు అర్హులు.. : డిగ్రీ, డిప్లొమా మొదటి సంవత్సరంలో చేరిన అమ్మాయిలు ఉపకారవేతనాలకు మాత్రమే అర్హులు. వీరు దేశంలో గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాలలో రెగ్యులర్‌గా పది, ఇంటర్మీడియట్ చదివి ఉండాలి. ✦ దూరవిద్యలో చదివేవారు, గతంలో ఉపకార వేతనాలు పొందినవారు అనర్హులు.

అయిదేళ్ల పాటు సాయం..

అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థినులకు ఏడాదికి రూ.30 వేల చొప్పున అందిస్తారు. ఐదేళ్ల పాటు సాయం చేస్తారు. ✦ ఈ ఏడాది దేశవ్యాప్తంగా 1.95 లక్షల మంది విద్యార్థినులకు సాయం అందించాలని నిర్ణయించారు. కొత్తగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో మన రాష్ట్రానికి చోటు కల్పించారు.

జత చేయాల్సినవి.. : ఆధార్‌కార్డు, పదో తరగతి, ఇంటర్ మార్కుల మెమోలు, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి రుజువు పత్రంతో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆగస్టు 31 ఆఖరు తేదీగా నిర్ణయించారు.

కైలాసం.. కమనీయ దృశ్యం

శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సుందరీకరణ పనులు చేపట్టారు. ప్రకృతి రమణీయతను పంచే కొండ చరియల్లో దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏనుగులు, నెమళ్లు, హంసల చిత్రాలు, సహజత్వంతో ఉట్టిపడేలా కృత్రిమ జలపాతాలు భక్తులను అమాంతం ఆకట్టుకుంటున్నాయి. సప్తగోకులం పరిసర ప్రాంతాలను సుమారు రూ.25 లక్షలతో పచ్చదనంతో సర్వాంగ సుందరంగా భక్తులు మెచ్చేలా తీర్చిదిద్దారు. దర్శనార్థం వచ్చే భక్తులు ఆనందంతో చరవాణుల్లో పదిలం చేసుకుంటూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. - **న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**



సప్తగోకులం వద్ద ఆకట్టుకుంటున్న శ్రీమహావిష్ణు ప్రతిమ



కొండను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారిలా..

'హైస్కూల్ ప్లస్'.. అంతా మైనస్!

అగమ్యగోచరంగా విద్యార్థుల భవితవ్యం

ఈనాడు డిజిటల్, తిరుపతి: ఎంతో ఉన్నతాశయంతో ప్రారంభమైన 'హైస్కూల్ ప్లస్' విధానం పూర్తిగా గాడితప్పింది. సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లేకపోవడంతో వాటి నిర్వహణ గాలికి దీపంలా తయారైంది. పూర్తిస్థాయిలో ప్రిన్సిపాళ్లను నియమించకపోవడం, కేవలం డిప్యూటేషన్ అధ్యాపకులతోనే నెట్టుకొస్తుండటంతో వ్యవస్థ కుంటుపడింది. ముఖ్యంగా పాఠశాల విద్యాశాఖకు, ఇంటర్మీడియట్ బోర్డుకు మధ్య కనీస సమన్వయం లేకపోవడం, అదనపు బాధ్యతలు తీసుకుంటున్న ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రోత్సాహకాలు అందకపోవడంతో ఈ సంస్థలు చతికిలబడుతున్నాయి.

త్రిశంకు స్వర్గంలో పర్యవేక్షణ

ఈ విధానం విద్యాశాఖలో వింత పరిస్థితిని సృష్టించింది. ఒకరకంగా ఈ సంస్థలు ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక్కడ ఇంటర్మీడియట్ సిలబస్ అమలవుతున్నప్పటికీ.. ఇవి ఇంటర్ బోర్డు పరిధిలోని ఆర్ఐవోల పర్యవేక్షణలోకి రావు. ఇవి కేవలం పాఠశాల విద్యాశాఖ పరిధిలోనే ఉంటాయి. పరీక్షలు నిర్వహించుకోవడానికి, అడ్మిషన్ల అనుమతుల కోసం మాత్రమే ఇంటర్ బోర్డును ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయో ప్రత్యక్షంగా పర్యవేక్షించేవారు కరవయ్యారు.

బోధనేతర సిబ్బంది లేరు

ప్రతి సెక్షన్‌కు 80 మంది విద్యార్థుల సామర్థ్యం ఉన్నప్పటికీ.. కనీస మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన కొరవడటంతో ఈ 'ప్లస్' స్కూళ్లలో చేరికలు నామమాత్రంగానే ఉంటున్నాయి. దీనికితోడు క్లర్కులు, అటెండర్లు, స్వీపర్లు వంటి నాన్-టీచింగ్ (బోధనేతర) సిబ్బంది నియామకం ఊసేలేదు. దీంతో రికార్డుల నిర్వహణ నుంచి చిన్నచిన్న పనుల వరకు అధ్యాపకులే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పర్యవేక్షణ లోపం, బోధనాపరమైన ఇబ్బందుల కారణంగా ఇక్కడ పరీక్షా ఫలితాలు దారుణంగా పడిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ 'హైస్కూల్ ప్లస్'ల దుస్థితిపై దృష్టి సారించాలని, తక్షణమే ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బందిని నియమించి వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

హెచ్ఎంల సతమతం.. దక్కని ప్రోత్సాహం

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున.. 37 స్కూళ్లను 'హైస్కూల్ ప్లస్'లుగా అప్‌గ్రేడ్ చేశారు. నిబంధనల ప్రకారం ఇంటర్మీడియట్ విద్యను బోధించే ఈ సంస్థలకు ప్రత్యేకంగా ఒక ప్రిన్సిపల్ ఉండాలి. కానీ ఆయా పాఠశాలల హెచ్ఎంలకే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. సాధారణంగా జూనియర్ కాలేజీలు, పోలీసు శిక్షణ కేంద్రాలకు డిప్యూటేషన్‌పై వెళ్లే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఒక ఇంక్రిమెంట్ అదనంగా ఇస్తూ ప్రోత్సహిస్తోంది. కానీ వీటిలో బోధిస్తున్న పీజీటీలకుగానీ, బాధ్యతలు పర్యవేక్షిస్తున్న హెచ్ఎంలకుగానీ ఎలాంటి అదనపు ఆర్థిక ప్రయోజనం, గుర్తింపు దక్కడం లేదు. దీంతో ఇప్పటికే పాఠశాల విధులతో సతమతమవుతున్న హెచ్ఎంలు ఈ అదనపు భారాన్ని మోసేందుకు, 'ప్లస్-2' వ్యవహారాలపై దృష్టి సారించేందుకు ఆసక్తి చూపడం లేదు.

'ప్లస్' వద్దంటున్న స్కూళ్లు

ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించకుండానే, హెచ్ఎంలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండానే అప్‌గ్రేడ్ చేస్తుండటంతో కొన్ని పాఠశాలలు 'ప్లస్' హోదాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇందుకు సత్యనారాయణపురం పాఠశాల పరిస్థితే ప్రత్యక్ష ఉదాహరణ. ప్రభుత్వం ఈ పాఠశాలకు 'హైస్కూల్ ప్లస్' అవకాశం ఇచ్చినా, అక్కడ బోధించడానికి పీజీటీలు లేకపోవడం, బాధ్యతలు తీసుకునేందుకు వారు సుముఖంగా లేకపోవడంతో అడ్మిషన్లు చేసుకోలేదు. సంవత్సరం గడిచినా ప్రభుత్వం కొత్తగా పీజీటీలను నియమించలేదు. దీంతో ఇతర పాఠశాలల నుంచి కేవలం కొందరు ఉపాధ్యాయులను (తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) తీసుకొచ్చి డిప్యూటేషన్ మీద క్లాసులు చెప్పిస్తూ నెట్టుకొస్తున్నారు.

తెలుగు కీర్తి.. తరతరాలకు స్ఫూర్తి



మాతృభాషతోనే గౌరవం లభిస్తుందని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు మల్రిపూడి దేవేంద్రరావు, అధ్యక్షుడు నారాయణస్వామి పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని ఆదివారం చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెలో నిర్వహించారు. 'తెలుగు సాహితీ వికాసం'పై కవి సమ్మేళనం చేపట్టారు. వక్తలు మాట్లాడుతూ.. తెలుగు కీర్తి భావితరాలకు స్ఫూర్తి అన్నారు. భాషను విస్మరిస్తే మనుగడ ఉండదన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలను సత్కరించారు. హరినాయుడు, గోవిందన్, కన్నయ్యనాయుడు, కోటీశ్వరమొదలియార్, సంధ్యాశర్మ, ఉష, వరలక్ష్మమ్మ, కీర్తప్రియ, యువన్య, మునీంద్ర, విమల తదితరులు పాల్గొన్నారు.

- **న్యూస్‌టుడే, చిత్తూరు (సంతపేట)**

సహజ జీవనమే ఆరోగ్యానికి శాశ్వత పునాది

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రకృతికి అనుగుణంగా జీవించడం, సహజ ఆహారం తీసుకోవడం, తగినంత విశ్రాంతి, స్వచ్ఛమైన నీరు, గాలిని అలవాటుగా చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డా.మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. ఆయుష్, తితిదే ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన ఆరోగ్య పరిరక్షణ అవగాహన కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ.. సహజ ఆహారం, స్వచ్ఛమైన నీరు, గాలి, తగినంత విశ్రాంతి ఆరోగ్య సంజీవనిలోని నాలుగు ముఖ్య అంశాలని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ముందుగానే శ్రద్ధ వహించి మంచి జీవన అలవాట్లు పాటించాలన్నారు.

అర్హులెవరూ ఓటు కోల్పోకుండా చూడాలి



వివరాలు పరిశీలిస్తున్న నగరి ఆర్డీవో అనుపమ

పుత్తూరు, న్యూస్‌టుడే: ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో అర్హులైన ఏ ఒక్కరూ ఓటును కోల్పోకుండా చూడాలని నగరి ఆర్డీవో అనుపమ పేర్కొన్నారు. పుత్తూరు పురపాలికలో సర్ ప్రత్యేక శిబిరాలను ఆదివారం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. పుత్తూరు పురపాలికలో 36 మంది ఫారం6 అందజేశారన్నారు. వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. పురపాలక కమిషనర్ నాగేశ్వరరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: చిత్తూరు, పలమనేరు జాతీయ రహదారిలోని కేజీసత్రం యూటర్న్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఐరాల మండలం గోవిందరెడ్డి పల్లెకు చెందిన వీరభద్రారెడ్డి (83), మార్కొండరెడ్డి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. కుప్పం నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వారిని ఢీకొంది. ఇద్దరికీ గాయాలవగా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వీరభద్రారెడ్డి మార్గమధ్యలో మృతి చెందారు. తీవ్రగాయాలతో మార్కొండరెడ్డి చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వంతెన పైనుంచి పడి..

పూతలపట్టు, న్యూస్‌టుడే: చిత్తూరు- తిరుపతి ఆరు వరుసల జాతీయ రహదారి పక్కనున్న వంతెన పైనుంచి కింద పడి ఒకరు మృతి చెందిన ఘటన గోపాలకృష్ణాపురం సమీపంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గుడిపాల మండలం పేయనపల్లెకి చెందిన తిరుమల(35) తిరుపతి జిల్లా కరకంబాడిలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని ఆదివారం ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. మండలంలోని గోపాలకృష్ణాపురం సమీపంలో అదుపు తప్పి వంతెన పైనుంచి కింద పడిపోయారు. ఘటనా స్థలంలోనే ఆయన మృతి చెందారు. శవ పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని..

పలమనేరు, న్యూస్‌టుడే: మండలంలోని క్యాటిల్ ఫారం వద్ద కారు ఢీకొని బాబు(40) అనే వ్యక్తి మృతి చెందారు. ఆదివారం సాయంత్రం పలమనేరు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న బాబును ఎదురుగా బెంగళూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. మృతుడు యాదమరి మండలం మాపాక్షికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెదేపా నాయకుడు..



యుగంధర్ (పాతచిత్రం)

గుడుపల్లె, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో చీకటిపల్లె పంచాయతీ తెదేపా నాయకుడు టి.యుగంధర్ (34) మృతిచెందిన ఘటన కుప్పం-గుడుపల్లె ప్రధాన మార్గం గుత్తార్లపల్లె సమీప మలుపు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తెలుగు యువత మాజీ అధ్యక్షుడు యుగంధర్ పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుప్పం పట్టణంలో పనికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా బాటగంగమ్మ ఆలయం వద్ద అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం పీఈఎస్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలియజేశారు. ఆయనకు భార్య బేబి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య బేబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలియజేశారు.

భార్య కాపురానికి రాలేదని వేలు కోసుకున్న భర్త

రామకుప్పం న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాలేదని మనస్తాపంతో బొటనవేలు కోసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు. గాంధీనగర్‌కు చెందిన మంజునాథ్, బల్ల గ్రామానికి చెందిన యువతికి వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. కొంతకాలం నుంచి మంజునాథ్ తరచూ మద్యం తాగేవాడు. చెడు అలవాట్లు మానుకోవాలని భార్య అతన్ని నిలదీసేది. తీరు మార్చుకోవాలంటూ ఆదివారం ఉదయం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను అత్తగారింటికి వెళ్లి తిరిగి ఇంటికి రావాలని ఘర్షణ పడ్డారు. వ్యసనాలు మానుకోకపోతే తిరిగిరానని భార్య తెగేసి చెప్పడంతో మనస్తాపంతో మంజునాథ్ తన బొటన వేలును కోసి అత్తింట్లో పడేసి వెళ్లిపోయాడు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

రెడ్‌హిల్స్: తిరువళ్లూర్ సమీపం తిరుపాచ్చూరులో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులను ఆపి సోదా చేశారు. 6 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా నగరికి చెందిన వారిగా గుర్తించారు.

మహిళ హత్య కేసులో ప్రియుడి అరెస్టు

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా నింద్ర మండలం సవరంబాక్కం గ్రామానికి చెందిన అరుణ(45) తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోట సమీపం దొడ్డారెడ్డికుప్పంలో గురువారం రాత్రి హత్యకు గురయ్యారు. మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తిరువళ్లూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. అరుణ భర్త మంజునాథ నాయుడు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వీరి కుమారుడు, కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. అరుణ తల్లిదండ్రులు పెరియపాళ్యం సమీపం వడట్టూరులో ఉంటున్నారు. దీంతో ఆమె అక్కడకు వెళ్లి వస్తుంటుంది. ఇలా వచ్చి వెళ్లే క్రమంలో అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ భారతిరాజాతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. రహస్య ప్రాంతంలో ఇద్దరూ తరచూ కలిసే వారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వడట్టూరులో జరిగిన వివాహ వేడుకలో అరుణ పాల్గొంది. అనంతరం భారతిరాజాతో ద్విచక్ర వాహనంపై దొడ్డారెడ్డికుప్పానికి చేరుకుంది. ఏకాంతంగా గడుపుదామని అరుణ కోరగా భారతిరాజా నిరాకరించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన భారతిరాజా వెంట తీసుకొచ్చిన మోటారు ఆయిల్‌ను ఆమెపై పోసి నిప్పంటించి పారిపోయాడు. అరుణ మృతదేహం పక్కన సెల్‌ఫోన్ లభ్యమైంది. దీని ఆధారంగా భారతిరాజాను పోలీసులు శనివారం రాత్రి పెరియపాళ్యం సమీప పాలేశ్వరంలో అరెస్టు చేశారు. హత్య చేసినట్లు అతను అంగీకరించాడు. అనంతరం కోర్టులో హాజరుపరచి పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

కృత్రిమ చేతుల పంపిణీ



కృత్రిమ చేతులు పొందిన లబ్ధిదారులు

చిత్తూరు (కొంగారెడ్డిపల్లి), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో ఆదివారం రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ, రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత ఎల్ఎన్-4 కృత్రిమ చేతుల అమరిక కార్యక్రమంలో జిల్లాకు చెందిన 20 మంది లబ్ధి పొందారు. జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ తేజోమూర్తి ఆధ్వర్యంలో చిత్తూరు నుంచి లబ్ధిదారులను తీసుకెళ్లి కృత్రిమ చేతులను అందించారు. రాష్ట్ర ఛైర్మన్ రామారావు, వైస్ ఛైర్మన్ రాజు, సిబ్బంది చిరంజీవి పాల్గొన్నారు.


గణనాథుడి సేవలో ఎమ్మెల్యే.. కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈవో పెంచలకిశోర్, అర్చకులు రాజగోపురం వద్ద స్వాగతం పలికారు.

ఇక్కడో బావి ఉంది.. జాగ్రత్త



చిత్తూరు నగరంలోని తాళంబేడు మార్గంలో కన్నికాపురం సమీపం ఐటీసీఎల్ పైపులైన్ ప్లాంట్ వద్ద బావి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఆనుకొని ఉండటంతో పాటు చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. దీంతో అక్కడకు వెళ్లే వరకు కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో నిత్యం లారీలు, ట్రాక్టర్లతో పాటు పాఠశాలల బస్సులు వెళ్తున్నాయి. ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు బావిలో పడే ప్రమాదముంది. రక్షణ గోడ నిర్మించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, చిత్తూరు (మిట్టూరు)**

అలంకారప్రాయంగా ట్యాంకు



వెదురుకుప్పం మండలంలోని పాతగుంట నడిమ ఊరులో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్యాంకును నిర్మించి రంగుల వేశారు. కానీ ప్రారంభించకుండా వదిలేశారు. గ్రామస్థులు సమీప పొలాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. విషయం పంచాయతీ అధికారులకు తెలియజేస్తే నిధులు లేవని, ఎవరైనా ముందుకు వచ్చి సాయం చేస్తే సమస్య పరిష్కరిస్తామని చెబుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, వెదురుకుప్పం**

అంచుకు వెళ్తే ప్రమాదమే



తవణంపల్లె మండలంలోని అరగొండ- ఈచనేరి ప్రధాన రహదారిలో కోళ్లఫారం షెడ్డు సమీపంలో రోడ్డు పక్కన గొయ్యి ఏర్పడింది. వ్యవసాయ పొలాలకు నీరు తరలించే పైపు లీకవడంతో గొయ్యి తవ్వి వదిలేశారు. రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తవణంపల్లె**



కార్యక్రమానికి హాజరైన టైలర్లు

టైలర్లకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలి

నగరి, న్యూస్‌టుడే: టైలర్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించాలని రాష్ట్ర టైలర్ల సంఘం ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.స్వామి కోరారు. నగరిలో ఆదివారం ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అర్హులకు అందాల్సిన పథకాలు, సంఘ సభ్యులు కోరే అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. టైలర్లు నైపుణ్యం సాధించేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర సభ్యులు చాన్‌బాషా, బాలసుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు అశోక్, భాస్కర్, శివ, నారాయణ, ఉమాపతి, టి.వీరయ్య, నాగూర్‌బాషా, కృష్ణయ్య, శ్రీకాళహస్తి, పుత్తూరు, పిచ్చాటూరు, నాగలాపురం, కార్వేటినగరానికి చెందిన సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం.. రైతులకు నష్టం

పెనుమూరు, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పులతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఖరీఫ్‌లో స్థానిక రైతులు ప్రధానంగా వేరుసెనగ సాగు చేస్తారు. మెట్ట ప్రాంతాల వారు వర్షాలపై ఆధారపడి పంటలు పండిస్తారు. సకాలంలో వానలు పడితేనే పంటలకు అనుకూలం. కానీ ఈ ఏడాది వర్షాలు పూర్తిగా ముఖం చాటేయడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వర్షాభావంతో ఎక్కడ చూసినా మెట్ట ప్రాంతాలు బీడుగా దర్శనమిస్తున్నాయి.

17 శాతమే పంటలు..

సాధారణంగా ఏటా మేలో తొలకరి వర్షాలు కురిసిన తర్వాత రైతులు వేరుసెనగ కోసం దుక్కులు సిద్ధం చేస్తారు. అదే సమయంలో ప్రభుత్వం రాయితీపై విత్తనాలు అందిస్తుంది. జూన్, జులైలో వర్షాలు పడితే విత్తనాలు వేస్తారు. ఆలస్యమైతే ఆగస్టు 15 వరకు సాగుకు అవకాశం ఉంటుంది. కానీ ఈ ఏడాది ఎల్‌నినోతో సాగుపై తీవ్ర ప్రభావం పడింది. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో సాధారణ సాగు 4493 హెక్టార్లు కాగా ఈ ఏడాది 802 హెక్టార్లలో మాత్రమే సాగైంది. సాధారణ సాగులో 17 శాతం మాత్రమే పంటలు వేశారు. గత ఏడాది సుమారు 90 శాతం విస్తీర్ణంలో వేరుసెనగ పండింది.



తిరివిరెడ్డిపల్లె సమీపంలో బీడుగా మారిన మెట్టభూమి

మండలాల వారీగా సాగు వివరాలు..

మండలం	సాధారణం (హెక్టార్లలో)	ప్రస్తుతం
పెనుమూరు	1023	132
జీడీనెల్లూరు	1400	201
కార్వేటినగరం	202	78
వెదురుకుప్పం	905	96
ఎస్ఆర్‌పురం	630	230
పాలసముద్రం	333	65

సేంద్రియమే మేలు..

ఎల్‌నినో ప్రభావంతో వేరుసెనగ సాగు తగ్గింది. ప్రత్యామ్నాయంగా రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో ఆరు తడి పంటలు వేయడం మంచిది. సోయాబీన్ సాగు లాభదాయంగా ఉంటుంది.

- సుహర్‌లత, ఏవో, పెనుమూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

? గుడిపాల మండలంలోని వెప్పాలమానుచేను గ్రామంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నాం. **- గణేష్** ✓ దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. **- శిరీష, ఎంపీడీవో - న్యూస్‌టుడే, గుడిపాల** ? పాలసముద్రం మండలంలోని గొల్లకండ్రిగలో వీధి దీపాలు రాత్రి వేళ వెలగక ఇబ్బందులు పడుతున్నాం. **- గ్రామస్థుడు** ✓ కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో - పాలసముద్రం**

తాగునీటి పైపులైను బాగు

నిండ్ర, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని నిండ్ర పంచాయతీకి చెందిన మిట్టకండ్రిగ దళితవాడలో తాగునీటి పైపులైను లీకై పారిశుద్ధ్యం లోపించిందని ఇటీవల ఈనాడులో వార్త ప్రచురితమైంది. ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణశర్మ పరిశీలించారు. పైపులైను బాగు చేయించి సమస్య పరిష్కరించారు.

ఆలయాల నిర్మాణాలకు భూమిపూజ



చుక్కావారిపల్లెలో.. ఎమ్మెల్యే జగన్మోహన్



బుగ్గకండ్రిగలో.. ఎమ్మెల్యే భానుప్రకాష్

గుడిపాల, న్యూస్‌టుడే: ఆలయాల సందర్శనతో ఆధ్యాత్మికత సొంతం అవుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చుక్కావారిపల్లెలో శ్రీపొన్నియమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తితిదే శ్రీవాణి ట్రస్టు ఆర్థిక సాయంతో నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. జీజేఎం ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెన్నకేశవులు నాయుడు, ఎంపీపీ గోళ్ల హరిప్రసాద్, తెదేపా మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యం నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రతాప్ నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజీ, నాయకులు పాల్గొన్నారు. * **నగరి:** బుగ్గకండ్రిగలో దేశమ్మ ఆలయం నిర్మాణానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ భూమి పూజ చేశారు. తితిదే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షలు రావడంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. తెదేపా మండల కార్యదర్శి వేణు, పీఏసీఎస్ ఛైర్మన్ బాలాజీ, నారాయణస్వామి నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నగరి, న్యూస్‌టుడే: తిరుపతి- చెన్నై జాతీయ రహదారి వీకేఆర్‌పురం వద్ద కారును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తిరుపతి జిల్లా నారాయణవనానికి చెందిన దొరైపాండికి తీవ్రగాయాలు అయ్యాయి. నారాయణవనం నుంచి ఆదివారం మధ్యాహ్నం ఆయన ద్విచక్ర వాహనంపై తిరుత్తణి వైపు వెళ్తున్నారు. ముందున్న కారును ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. క్షతగాత్రుడి అన్న గుర్తించి ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో దుప్పి మృత్యువాత

యాదమరి, న్యూస్‌టుడే: దాహం తీర్చుకునేందుకు జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పి కుక్కల దాడిలో మృతి చెందింది. ఆదివారం ఉదయం కీనాటంపల్లి బీట్ పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి దుప్పి ఈబీసీ కాలనీలోకి వచ్చింది. వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో అది మృతి చెందింది. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ సిబ్బంది చేరుకొని దుప్పికి పంచనామా చేయించారు.

హరికృష్ణ సేవలు మరువలేనివి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో హరికృష్ణ చేసిన సేవలు మరువలేనివని డీఐఈవో రఘుపతి అన్నారు. నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన హరికృష్ణ, ఆయన సతీమణిని ఆదివారం సత్కరించారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు దయానందరాజు, హేమలత, మజీద్, చాణిక్య, బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి, కార్యదర్శి మాధవనివాస్, గౌరవాధ్యక్షుడు నజీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎక్కడి చెత్త అక్కడే

పాలసముద్రం దళితవాడలో చెత్త కుప్పలుగా ఉండటంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలు పరిశుభ్రం చేయించాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని వీధుల్లో రోడ్ల పొడవునా వ్యర్థాలు కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామం ఆరంభంలో ఉన్న వ్యర్థాలు తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పాలసముద్రం**

పెథాలజీ అవగాహన సదస్సు.. కుప్పం: స్థానిక పీఈఎస్ వైద్య కళాశాలలో పెథాలజీ విభాగం అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. పెథాలజీ విభాగంలో మార్ఫాలజీ టూ మాలిక్యూల్స్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో వివిధ వైద్య కళాశాలల ప్రతినిధులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

భవనాలు శిథిలం.. భయం భయం



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి పాఠశాల భవనాలు. నియోజకవర్గ కేంద్రం జీడీనెల్లూరు ఉన్నత పాఠశాలలో నాలుగు తరగతి గదులు ఇలా పాడై ఉన్నాయి. ముఖ్యంగా గోడలు, కిటికీలు శిథిలమయ్యాయి. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. బాగు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు**

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌లో రజతం

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్ షిప్‌లో భాగంగా బాక్సింగ్ పోటీల్లో జీడీనెల్లూరు గురుకుల పాఠశాలకు చెందిన అనూష రజతం సాధించినట్లు జిల్లా గురుకుల సమన్వయకర్త పద్మజ, ప్రిన్సిపల్ ప్రభావతి, పీఈటీ రమీజ తెలిపారు. 52 కిలోల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు.



పతకం అందుకుంటున్న అనూష

నూతన నియామకం



సుమన్

కార్వేటినగరం, న్యూస్‌టుడే: కార్వేటినగరం మండల మాదిగ సంఘం అధ్యక్షుడిగా కొల్లాగుంట ఏఏడబ్ల్యూకు చెందిన సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని బండ్రేవు కాలనీలో సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఎంపీఎస్ అధ్యక్షుడిగా మురగయ్య, మాదిగ సంఘం మండల బాధ్యుడిగా వెంకటాచలం ఎంపిక య్యారు. సంఘం రాష్ట్ర నాయకులు కిషోర్‌మాదిగ, గోపాల్‌మాదిగ, ధనంజయమాదిగ పాల్గొన్నారు.



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ.. పుంగనూరు: బండ్లపల్లె గ్రామంలో ఆదివారం బోయకొండ గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా హోమాలు, పూజలు నిర్వహించారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజశేఖర్

పాలసముద్రం, న్యూస్‌టుడే: బంగారు భవిష్యత్తు లక్ష్యంగా యువత చదువుపై దృష్టి సారించాలని ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఆముదాల పుత్తూరులో డ్రగ్స్, సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెలిసీతెలియని వయసులో చెడు స్నేహాలు, మాదకద్రవ్యాలు, సామాజిక మధ్యమాల మోజులో పడి జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. అనుమానాస్పద లింక్‌లు, ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఆన్‌లైన్ పరిచయాలతో ఎక్కువ నష్టమే జరుగుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలన్నారు.

వైభవంగా కానగలమ్మ తిరునాళ్ల



ఊరేగుతున్న అమ్మవారు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: కార్వేటినగరంలో కానగలమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. రాత్రి అలంకరించి గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. యాదవ సంఘం సభ్యులు మోహన్, గురుమూర్తి, ధనయాదవ్, వెంకటకృష్ణయాదవ్, శేషాద్రి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూజలు



అలంకరణలో దేవతామూర్తులు

నిండ్ర, న్యూస్‌టుడే: నిండ్రలోని శ్రీద్రౌపది దేవి సమేత ధర్మరాజుల ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని పొంగళ్లు పెట్టి వేద పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సాయంత్రం దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. దాతల సాయంతో భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం

కడా ఆధ్వర్యంలో నేడు గ్రీవెన్స్

కుప్పం పట్టణం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కడా ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి కడా పీడీ వికాస్ మర్మత్ వినతులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాఘవేంద్రస్వామి మధ్య ఆరాధన

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం మధ్య ఆరాధన ఉత్సవాలను నిర్వహించారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు చేపట్టే ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు వ్యక్తిగతంగా స్వామివారికి పూజలు చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పుంగనూరు, న్యూస్‌టుడే: మండలంలోని బండ్లపల్లె గ్రామంలో ఆదివారం బోయకొండ గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజరెడ్డి దంపతులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఎన్.రెడ్డెప్ప, పెద్దిరెడ్డి, వెంకటరెడ్డియాదవ్, అమరనాథరెడ్డి, చెంగారెడ్డి, అగిస్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



బిందె నీటికి... పది బిందెలు వృథా



కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఓ వైపు ఎల్‌నినో కారణంగా తీవ్ర వర్షాభావం నెలకొంది. దీంతో కుప్పంలోని చెరువులన్నీ ఎండుముఖం పట్టాయి. ఈ సమయంలో నీటి వృథా కాకుండా అరికట్టాల్సి ఉన్నా నిర్లక్ష్యం కారణంగా ఇలా సగానికి పైగా నీరు వృథాగా మురుగునీటి కాలువ పాలవుతోంది. కుప్పం పట్టణం నారాయణస్వామి వీధిలోని తాగునీటి పైపు వద్ద ఓ బిందె నిండుతుంటే.. మరో వైపు పగిలిన పైపు నుండి అంతకన్నా ఎక్కువ నీరు వృథాగా పోతోంది. ఇక నీటి సంరక్షణ ఎలా సాధ్యమంటూ స్థానికులు అంటున్నారు.

ప్రహరీ కూలి.. రక్షణ కొరవడి



మండల పరిధి ఎంకేపురంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ 15 ఏళ్ల కిందట నిర్మించిన రక్షణ గోడ కూలిపోయింది. ఎంకేపురం-శాంతిపురం రహదారి పక్కన మురుగునీటి కాలువను ఆనుకొని ప్రహరీ కూలిపోవడంతో ప్రమాదకరంగా తయారైంది. ప్రవేశ మార్గంలో గేటు లేకపోవడం.. చుట్టూ పంట పొలాలు ఉన్నందున విద్యార్థుల భద్రతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రహరీ మరమ్మతు చేసి గేటు ఏర్పాటు చేయాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, శాంతిపురం

చెత్త పడేస్తే మురుగు పారేదెలా



మండల పరిధి కీలపట్లలోని అన్నదాన సత్రం వద్ద ఉన్న కాలువల్లో పూడిక తీయక వదిలేశారు. కాలువ ప్లాస్టిక్ బాటిల్స్ కవర్లతో నిండిపోయింది. దీంతో మురుగు పారక దుర్వాసన వస్తోంది. మురుగు కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గంగవరం

కృత్రిమ చేతుల పంపిణీ

చిత్తూరు (కొంగారెడ్డిపల్లి), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో ఆదివారం రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత ఎల్ఎన్-4 కృత్రిమ చేతుల అమరిక కార్యక్రమంలో జిల్లాకు చెందిన 20 మంది లబ్ధి పొందారు. జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ తేజోమూర్తి ఆధ్వర్యంలో చిత్తూరు నుంచి లబ్ధిదారులను తీసుకెళ్లి కృత్రిమ చేతులను అందించారు. రాష్ట్ర ఛైర్మన్ రామారావు, వైస్ ఛైర్మన్ రాజు, సిబ్బంది చిరంజీవి పాల్గొన్నారు.

ఆక్రమణకు కాదేదీ అనర్హం

పలమనేరు, న్యూస్‌టుడే: రహదారుల కింద నుంచి వర్షపు నీరు సాఫీగా వెళ్లి నేల కోతను నివారించడానికి ప్రభుత్వం కల్వర్టులను నిర్మిస్తోంది. భారీ వర్షాలకు వరదలు వచ్చిన సమయంలో నీరు రోడ్లపైకి రాకుండా కల్వర్టులు రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉపయోగపడతాయి. ఇప్పుడు కల్వర్టులు పూర్తిగా ఆక్రమణలకు గురై కొన్నిచోట్ల రూపురేఖలు మారిపోగా మరికొన్ని నామరూపాల్లేకుండా పోయాయి. పలమనేరు మండలంలోని ముసలిమడుగు కొత్తిండ్లు వద్ద రెండు గ్రామాల ప్రజలు వర్షాకాలంలో నదిని దాటలేక అవస్థలు పడుతున్నారు. పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి మండలాల్లో కల్వర్టులు ఆక్రమణల పాలయ్యాయి.



మేలుమాయి వద్ద జాతీయ రహదారి కింద మూతపడ్డ కల్వర్టు

రియల్ వ్యాపారులదే హవా

పలమనేరు నుంచి పుంగనూరు వెళ్లే ప్రధాన రహదారిలో గంగవరం మండల కేంద్రం సమీపంలో స్థలాలకు విలువ పెరిగింది. ప్రస్తుతం అక్కడ వెంచర్లు ఎక్కువే. గంగవరం నుంచి మబ్బువాళ్లపేట మధ్య రెండు కల్వర్టులు, మల్లేరు వద్ద ఒకటి మూతపడ్డాయి. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు సమీపంలోని చెరువులకు రావడానికి పూర్వం ఏర్పాటుచేసిన కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. రెండు వైపులా ఆక్రమించడంతో వీటితో ప్రజలకు ప్రయోజనం చేకూరలేదు. గంగవరం మండలంలో రియల్ వ్యాపారులు వాగులు, వంకలతో పాటు కల్వర్టులను ఆక్రమిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే

పలమనేరు నుంచి కుప్పం వెళ్లే దారిలో మొరం, నక్కపల్లె, పలమనేరు నుంచి గుడియాత్తం రహదారిలో టి.వడ్డూరు, పెంగరగుంట, గంగవరం మండలంలో మబ్బువాళ్లపేట, మేలుమాయి, కల్లుపల్లె, పెద్దపంజాణి మండలంలో బట్టందొడ్డి, నిడిగుంట గ్రామాల పరిధిలో ప్రధాన రహదారిలోని కల్వర్టులు కనుమరుగయ్యాయి. పలమనేరు బైపాస్‌లో గంగవరం మండలంలోని మన్నారునాయనిపల్లె, చిన్నూరు వద్ద ప్రధాన కల్వర్టులు మూసుకు పోయాయి. దీంతో వర్షపు నీరు ఈ ప్రాంతాల్లో వర్షపునీరు బయట వెళ్లేందుకు అవకాశం లేక నిలిచి పోతున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కల్వర్టులు ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదు. ఆక్రమణలకు గురైన వాటిని పరిశీలించి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో అందరి సహకారం అవసరం.

- రేఖ, తహసీల్దారు, గంగవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
శాంతిపురం: 93918 30897

పలమనేరు, న్యూస్‌టుడే: ? పట్టణంలోని లింగాయతివీధిలో పారిశుద్ధ్య పనులు చేయాలి. కాలువల్లో పేరుకుపోయిన మురుగుతో దుర్వాసన వేస్తోంది. దోమల బెడద కూడా ఎక్కువగా ఉంది. **- స్థానికులు**

✦ సిబ్బందిని పంపి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **- రెడ్డిబాబునాయక్, శానిటరి అధికారి**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణం రామచంద్రా రోడ్డులో మురుగునీటి కాలువలో చెత్తాచెదారాన్ని రోడ్డుపై పారబోశారు. దీని కారణంగా దుర్వాసన వస్తోంది. **- మురుగేష్, కుప్పం** ✦ పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, కమిషనర్, కుప్పం పురపాలిక**

పాఠశాల ప్రహరీ నిర్మాణం పూర్తి

శాంతిపురం: మండల పరిధి ఏడో మైలులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుట్టూ నాడు- నేడు ద్వారా చేపట్టిన రక్షణ గోడ నిర్మాణం అసంపూర్తితో విద్యార్థులకు ఎదురవుతున్న అసౌకర్యంపై ఇటీవల 'ఈనాడు'లో 'ప్రహరీ నిర్మాణం అర్ధాంతరం' శీర్షికన ప్రచురితమైన కథనంపై సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు స్పందించారు. రక్షణ గోడ నిర్మాణం పూర్తి చేసి గేటును ఏర్పాటు చేశారు. మిగతా అభివృద్ధి పనులను చేపడుతున్నారు.

పీఈఎస్‌లో పెథాలజీ అవగాహన సదస్సు

కుప్పం, న్యూస్‌టుడే: స్థానిక పీఈఎస్ వైద్య కళాశాలలో పెథాలజీ విభాగం అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. పెథాలజీ విభాగంలో మార్ఫాలజీ టూ మాలిక్యూల్స్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో దేశంలోని వివిధ వైద్య కళాశాలలకు చెందిన ప్రతినిధులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. పీఈఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌కే సుబ్రహ్మణ్యం, కళాశాల వైస్ ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, పెథాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ రామస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సుబ్రహ్మణ్యం, రామస్వామి తదితరులు

పార్టీ నిర్ణయం మేరకు పనిచేస్తా

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: 30 సంవత్సరాలుగా తనతో పాటు కుటుంబసభ్యులు అందరూ తెదేపాలో ఉంటూ పార్టీ అభివృద్ధికి పని చేస్తున్నామని పుంగనూరు నియోజకవర్గ తెదేపా పూర్వ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. తాను పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా ఏ తప్పు చేయలేదని పక్క నియోజకవర్గాల్లోని నాయకులు తనపై అధిష్ఠానానికి ఫిర్యాదులు చేయడంతో సీఎం చంద్రబాబు నాయుడు తనను ఇన్‌ఛార్జి పదవి నుంచి తొలగించారని ఆవేదన చెందారు. ఇకపై కూడా పార్టీ నిర్ణయం మేరకు కట్టుబడి పని చేస్తామని చెప్పారు. పార్టీ తనకు సహకరించే వరకు కార్యకర్తలకు అన్నివిధాలా సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

కాలనీ సమస్యలు తీర్చండి



సమస్యను చెబుతున్న గ్రామస్థులు

సోడిగానిపల్లె,(గుడుపల్లె), న్యూస్‌టుడే: మండల పరిధి సోడిగానిపల్లె పంచాయతీ ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం ఏర్పాటైన కాలనీ వాసులకు కనీస వసతులు కరవయ్యాయి. తాగునీరు, విద్యుత్తు దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి బోరుబావి మరమ్మతుకు గురికావడంతో రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న పంచాయతీ కేంద్రం నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కూలీ జీవనం సాగిస్తున్న కాలనీ చుట్టూ ముళ్లపొదలు ఉన్నందున విద్యుత్తు సౌకర్యం లేక చీకట్లో ఉంటున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సోలార్ విద్యుత్తు వసతి కల్పించాలి

నిరుపేదలమైన మా కుటుంబాలకు ఇళ్లపై సోలార్ విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేయాలి. బంగారు కుటుంబం పథకం కింద ఆర్థిక చేయూతనిచ్చి ఉపాధి కల్పించాలి.

- మునివెంకటమ్మ, స్థానికురాలు

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఘన స్వాగతం

పలమనేరు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం తెదేపా నూతన ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యకు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఓ వివాహానికి హాజరైన వారికి మొలకలచెరువు వద్ద పార్టీ నేతలతో కలిసి ఆహ్వానించారు. రెండు రోజుల కిందట తంబళ్లపల్లె తెదేపా ఇన్‌ఛార్జిగా శంకర్‌యాదవ్ బాధ్యతలు తీసుకున్న సంగతి తెలిసిందే. పార్టీ పూర్వవైభవానికి అంతా కలిసికట్టుగా పనిచేస్తామని శంకర్‌యాదవ్ చెప్పారు.



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న శంకర్‌యాదవ్

యువకులు.. ఆపద్బాంధవులు

☛ రక్తదానంలో ఆదర్శం

పలమనేరు, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఏ క్షణంలో ఎవరికి ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేము. అలాంటిది రోడ్డు, ఇతర ప్రమాదాలు, పలు వైద్య శస్త్రచికిత్సల సమయంలో రక్తం లభించక ఎందరో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో రక్తం కోసం రోగి బంధువులు ఇబ్బందులు పడుతుంటారు. కొన్ని సందర్భాల్లో ఇతర ప్రాంతాల నుంచి రక్తాన్ని తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఆధునిక ప్రపంచంలో ఎంతో మంది అపోహలతో రక్తం ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. అత్యవసర సమయాల్లో రక్తం లభించక ఎవరి ప్రాణాలు పోకూడదన్న లక్ష్యంతో కొందరు యువకులు రక్తదానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇప్పటికి 15 సార్లు



ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయడం ద్వారా కొత్త రక్తం రావడంతో పాటు ఆరోగ్యంగా ఉంటాం. నేను డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాను. అత్యవసర సమయాల్లో రోగులకు రక్తదానం చేస్తుంటాను. ఇప్పటి వరకు 15 విడతలకు పైగా రక్తదానం చేశా. **- విక్రమ్, కుప్పం**

మరొకరి ప్రాణం కాపాడాం



సమాజ సేవ చేయాలన్న దృక్పథం ఉంటే ఏ విధంగానైనా చేయవచ్చు. రక్తదానంతో మరొకరి ప్రాణం కాపాడామన్న ఆత్మ తృప్తి ఎప్పటికీ ఉంటుంది. ఇప్పటి వరకు 12 సార్లు పైగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచా. **- తంజిల్, కుప్పం**

ఎప్పుడైనా సిద్ధంగా ఉంటా



వైద్య చికిత్సల సమయంలో రక్తం దానం చేసేందుకు సిద్ధంగా ఉంటాను. ఇప్పటి వరకు పదికి పైగా రక్తదానం చేశాను. యువకులు రక్తదానంపై ఉన్న అపోహలు పోగొట్టేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **- వాసు, కుప్పం**

ప్రోత్సహిస్తే పతకాలు సాధిస్తాం

క్రీడల్లో సత్తా చాటుతున్న యువతులు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచే వారు క్రీడలపై పట్టు సాధించారు. ఉన్నత విద్య చదువుతున్నా కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణిస్తున్నారు. లక్ష్యంపై గురిపెట్టి ఆ దిశగా అడుగులు వేస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ద్రవిడ విశ్వవిద్యాలయ విద్యార్థినులు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకొన్నారు.

పోలీసు కావడమే లక్ష్యం



నేను చిన్నతనం నుంచే క్రీడలపై పట్టు సాధించా. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచా. భవిష్యత్తులో క్రీడల్లో మరింత పట్టు సాధించి పోలీస్ అధికారి కావడమే లక్ష్యంగా ముందుకెళుతున్నా.

- ఆర్.పునీత, ఎంఏ హిస్టరీ

ఒలింపిక్స్‌లో రాణించడమే ధ్యేయం



క్రీడలంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచే క్రీడలపై పట్టు సాధించి ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ 10కే పోటీల్లో రెండు సార్లు పాల్గొన్నా. జాతీయ స్థాయి ఖోఖో పోటీలు, రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్, 2కేలోనూ పాల్గొన్నాను. 1500 మీ రిలేలో ప్రథమ స్థానాలను సొంతం చేసుకున్నా. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో రాణించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నా. **- సుప్రియ, లైబ్రరీ సైన్స్**

సమాజ సేవ చేయాలని ఉంది



నేను పాఠశాలలో చదువుకునే రోజుల నుంచే ఖోఖో క్రీడపై పట్టు సాధించా. నా ప్రతిభను గుర్తించి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేశారు. చదువుతో పాటు ఓ వైపు క్రీడలు.. మరోవైపు ఎన్సీసీలో శిక్షణ పొందుతున్నా. భవిష్యత్తులో క్రీడా కోటాలో పోలీస్ అధికారిగా ఎంపికై సమాజ సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. **- హేమావతి, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)**

సవాళ్లను ఎదుర్కొని కుటుంబానికి అండగా నిలిచి

కుప్పం పట్టణం, పలమనేరు, న్యూస్‌టుడే: వారు జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. తమ కంటూ జీవనం ఉండాలని భావించారు. తాము పనిచేస్తున్న వృత్తినే వ్యాపారంగా చేసుకున్నారు. తాము కూడ కుటుంబ పోషణలో తమ వంతు భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. అదే వారిని ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు ఇచ్చింది. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది సొంతంగా వ్యాపారాలు చేస్తూ ఆదాయం గడిస్తూ కుటుంబ పోషణలో తమవంతు సహకారం అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు పలమనేరు పట్టణానికి చెందిన పలువురు మహిళలు.

కుటుంబ పోషణకు



కుటుంబ పోషణ కోసం నాకు తెలిసిన పనిలోనే సొంతంగా వ్యాపారం చేయాలనుకున్నాను. ఇంట్లో మొత్తం 7 మంది సభ్యులు ఉన్నాం. స్వయం సహాయక సంఘం ప్రోత్సాహంతో వైర్ నెట్ వ్యాపారం మొదలు పెట్టాను. పెట్టుబడి కోసం బ్యాంకు నుంచి రూ.4 లక్షలు రుణం పొందాను. ప్రస్తుతం వైరు నెట్ తయారు చేయడానికి పరిశ్రమల వారు ముడి పదార్థం ఇస్తున్నారు. దాని నుంచి నెట్లు తయారు చేసి వారికి అందించి ఆదాయం పొందుతున్నాను. ఈ వ్యాపారం ద్వారా నెలకు రూ.25 నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది.

- అనిత, పలమనేరు

సొంతంగా వ్యాపారం



మెడికల్ దుకాణంలో పనిచేస్తున్న సమయంలో సొంతంగా వ్యాపారం చేయాలనే ఆలోచన వచ్చింది. ఎలాగైనా తాను కూడ ప్రత్యేకంగా మందుల దుకాణం నిర్వహణకు కార్యరూపం ఇవ్వాలని భావించా. అందుకు స్వయం సహాయక సంఘం ఎంతో ఉపయోగపడింది. తనకు అనుభవం ఉన్న మందుల దుకాణం ఏర్పాటుకు రూ.8 లక్షల పెట్టుబడి పెట్టా. సొంతంగా కొంత.. బ్యాంకు ద్వారా మరి కొంత రుణం తీసుకుని వ్యాపారం ప్రారంభించాను. వ్యాపారం ప్రారంభం సమయంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి ముందుకు సాగాను. వ్యాపారంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమిస్తేనే రాణించగలం. తక్కువ సమయంలో మెప్మా సహకారంతో పొదుపు సొమ్ముతో పాటు బ్యాంకు రుణాన్ని అందుకున్నాను. ప్రస్తుతం నెలకు రూ.30 వేల వరకు ఆదాయాన్ని పొందుతున్నాను. **- రెడ్డెమ్మ, పలమనేరు**

ప్రశాంతంగా నీట్ పీజీ

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లో ఆదివారం నీట్ పీజీ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 80 మంది అభ్యర్థులకు 79 హాజరయ్యారు. వర్సిటీ వీసీ ఆచార్య మల్లయ్య, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లను పోలీసులు అధికారులు పర్యవేక్షించారు.

పలమనేరు: పట్టణ సమీపంలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో నీట్ పీజీ 150 మంది రాయాల్సి ఉండగా 8 మంది గైర్హాజరయ్యారు. **కుప్పం పట్టణం:** కుప్పం ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 214 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 211 మంది హాజరయ్యారు.



ద్రవిడ వర్సిటీలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

అంకితభావంతో విద్యాభివృద్ధికి కృషి



సత్కారం పొందిన సోమనాథం దంపతులతో ఉపాధ్యాయులు

పలమనేరు, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయుడు సోమనాథం అంకితభావంతో పనిచేశారని పలమనేరు ఎంఈవో లీలారాణి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన తరువాత ప్రశాంత జీవితాన్ని గడపాలని కోరారు. సోమనాథం దంపతులను ఉపాధ్యాయులు సన్మానించారు. విశ్రాంత ఎంఈవో వాసుదేవనాయుడు, ఉపాధ్యాయులు నేతాజి, షేక్ సాబ్జు పాల్గొన్నారు.

కూటమి చొరవతో సమస్యకు శాశ్వత పరిష్కారం

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధి మొరసనపల్లె పంచాయతీలో దీర్ఘకాలిక మురుగు సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపుతోంది. ఏడో మైలు గ్రామంలో కుప్పం-పలమనేరు జాతీయ రహదారితో పాటు కుప్పం-కేజీఎఫ్ అంతర్రాష్ట్ర డబుల్ రోడ్డుకు ఇరువైపులా ఇళ్ల నుంచి వచ్చే మురుగు రహదారులపై చేరడంతో స్థానికులు అసౌకర్యం ఎదుర్కొనేవారు. పంచాయతీ పరిధి మిగిలిన గ్రామాల వీధుల్లో ఈ సమస్య ఉంది. స్థానికుల వినతిపై స్పందించిన ప్రభుత్వం రూ.1.26 కోట్లు నిధులు కేటాయించింది. ప్రస్తుతం ఏడో మైలు, సమీప కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఏడోమైలులో డ్రైనేజీ నిర్మాణ పనులు

125 మందికి నేత్ర శస్త్రచికిత్స

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సాయిమాతా సేవాట్రస్టు, చెన్నై శంకర్ నేత్రాలయ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 125 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం కంటి శస్త్ర చికిత్సలు చేసుకున్న వారికి ఉచితంగా అద్దాలను సీఎం చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్ పంపిణీ చేశారు.

జూదరుల అరెస్టు

పలమనేరు, న్యూస్‌టుడే: నక్కపల్లె గ్రామ పొలిమేరలో జూదం ఆడుతున్న 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పలమనేరు సీఐ మోహన్‌రెడ్డి సిబ్బందితో జూద స్థావరంపై దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1.21 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.